నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 20: నగరంలోని పలు ఫీడర్లలో మరమ్మతులు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8:30 నుంచి 11:00 గంటల వరకు పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, వాసర హాస్పిటల్, రాజీవ్ పార్కు, సహజ అపార్ట్ మెంట్ ఏరియా, ధన్గర్ వాడీ స్కూల్, ఓల్డ్ లేబర్ అడ్డ, యశోద కృష్ణా హాస్పిటల్ ఏరియా, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, గోదాం గడ్డ, భగత్ నగర్, శ్రీరాంనగర్ కాలనీ, ఆదిత్య నగర్, విద్యానగర్, కొత్త యాస్వాడ, సాలెహ్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముదుఘంటికలు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కమాన్‌చౌరస్తా, మే 20 : తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి రచించిన 'ముదుఘంటికలు' కవితా సంపుటిని కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముదుగంటి పలు అవార్డులు పొందడమే కాకుండా కవితలు, రచనలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మాతృ భాషను గౌరవించడం, మాతృ భాషలోనే మాట్లాడడం ప్రతి వ్యక్తి బాధ్యతని చెప్పారు.

మేజర్ శిక్షణ పూర్తి చేసిన వివేకానంద ఎన్‌సీసీ అధికారి

ఎన్‌సీసీ అధికారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కమాన్‌చౌరస్తా, మే 20 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ అధికారిగా, కామర్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కెప్టెన్ కే కిరణ్ జ్యోతి మేజర్ శిక్షణ పూర్తి చేసుకొని పదోన్నతి పొందిన సందర్భంగా ఆమెను కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టుదలతో కృషిచేస్తే సాధించలేనిది ఏమీలేదని మేజర్‌గా పదోన్నతి పొందిన కెప్టెన్ కిరణ్ జ్యోతి నిరూపించారన్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 5 వరకు గ్వాలియర్‌లో జరిగిన మేజర్ శిక్షణను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 9ఏ బెటాలియన్‌లో మొదటి మహిళా మేజర్ అధికారిగా గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేజర్ కిరణ్ జ్యోతి మాట్లాడుతూ, తన పదోన్నతి శిక్షణ పూర్తి చేసుకోవడానికి సహకరించిన కళాశాల యాజమాన్యానికి, 9వ తెలంగాణ బెటాలియన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ వీ ఆగంరావు, ఏవో శ్రవణ్ కుమార్, ఏసీవో సంపత్ కుమార్, రామేశ్వరరావు, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీ సాగర్ తదితరులు ఆమెను అభినందించారు.

చీరల పంపిణీ

విద్యానగర్, మే 20: మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పుట్టినరోజు సందర్భంగా సోమవారం రేకుర్తిలో పిల్లలకు బొమ్మలు, స్టేషనరీ, మహిళలకు చీరల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ, పేద కుటుంబాలతో కలిసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మన మామిడికి ఫుల్ డిమాండ్

కరీంనగర్ పండ్ల మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

- కరీంనగర్ నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి
- ఈ నెల 17వరకు 6,169 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

ముకరంపుర, మే 20: కరీంనగర్ పండ్ల మార్కెట్‌లో మామిడి కొనుగోళ్ల జోరు కొనసాగుతున్నది. ఇటు రైతులతో పాటు వ్యాపారులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో కరీంనగర్‌తో పాటు సమీప జిల్లాల నుంచి సైతం ఫలసాయం పోటెత్తుతున్నది. అయితే కరీంనగర్ నుంచి మామిడి నేరుగా దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి కావడంతో మన జిల్లా మామిడికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తున్నది.

జిల్లాలో మానకొండూర్, తిమ్మాపూర్, రామడుగు, గంగాధర, గన్నేరువరం, కొత్తపల్లి, చొప్పదండి, కరీంనగర్ రూరల్, చిగురుమామిడితో పాటు ఇతర మండలాల్లో 6,500ఎకరాలకు పైగా విస్తీర్ణంలో తోటలు ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, అల్ఫాన్సో, దసేరి, తోతాపురి, హిమాయత్ రకాలకు మంచి ఆదరణ ఉంది. పూత దశ నుంచి మొదలుకుని కాయ పక్వానికి వచ్చే దశ వరకు అనువైన వాతావరణం, తగినంత ఉష్ణోగ్రతతో కాయల పరిమాణం, రుచి, నాణ్యత బాగుంటుందని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. అయితే జిల్లా రైతులతో పాటు పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాల రైతులు జిల్లా కేంద్రంలోని పండ్ల మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. కాయ నాణ్యతను బట్టి రైతులకు మంచి ధర లభిస్తున్నది. మార్కెట్ ప్రారంభంలో టన్నుకు రూ.65వేల నుంచి రూ.70వేల వరకు ధర పలుకగా ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.30వేల వరకు ధర పలుకుతున్నది. స్థానికంగా ఉన్న కమీషన్ ఏజెంట్ల ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన మామిడి వ్యాపారులు కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు. ఇక్కడి నుంచి మామిడి జమ్ము కశ్మీర్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, గుజరాత్‌కు ఎగుమతి అవుతుండగా, మార్కెట్ కమిటీకి మంచి ఆదాయం లభిస్తున్నది.

కరీంనగర్ మార్కెట్‌లో కొనుగోళ్ల వివరాలు

సంవత్సరం	కొనుగోళ్లు మెట్రిక్ టన్నుల్లో
219	3,945
2020	3,274
2021	1,091
2022	4,899
2023	8,817
2024	6,169(ఈ నెల 17వరకు)

మామిడి కొనుగోళ్లకు సకల సౌకర్యాలు

కరీంనగర్ పండ్ల మార్కెట్‌లో మామిడి కొనుగోళ్ల కోసం అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. రైతులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చే వ్యాపారులకు ఏ ఇబ్బంది తలెత్తకుండా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నం. ఏటా రైతులు మార్కెట్‌కు తెచ్చే మామిడి కాయల పరిమాణం పెరుగుతున్నది. మార్కెట్‌కు ఆదాయం కూడా అదే స్థాయిలో సమకూరుతున్నది.

- పురుషోత్తం, ఉన్నత శ్రేణి కార్యదర్శి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

మార్కెట్ స్థలం పరిశీలన

వెంకటేశ్వర్లపల్లిలో మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సైదాపూర్, మే20: వెంకటేశ్వర్లపల్లిలో నూతనంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 20: 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలెబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. నూతన ప్రవేశాల కోసం జిల్లాలో 5 సీట్లు కేటాయించగా, ఇందులో 3వ తరగతిలో లంబాడ బాలురకు ఒకటి, ఎరుకల బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి, 5వ తరగతిలో ఎరుకల బాలురకు ఒకటి, 8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒక సీటు చొప్పున ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైతే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.2లక్షలకు మించరాదని సూచించారు. ఔత్సాహికులైన విద్యార్థులు ఆదాయం, కులం, పుట్టిన తేదీ, చదువుతున్న పాఠశాల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జూన్ 6లోగా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 12న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, ప్రకటించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాల కోసం 9652118867 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం'

రాంనగర్, మే 20: సీఎం రేవంత్ రెడ్డి వర్షాకాలం పంట నుంచి బోనస్ ఇస్తామని స్పష్టం చేసినప్పటికీ బీజేపీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తప్పుడు ప్రచారాలు చేస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రవణ్ నాయక్, ఎండీ చాంద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దండి రవీందర్, షబానా మహ్మద్, జీడి రమేశ్, మెతుకు కాంతయ్య, సతీశ్ రావు, హసీనా, ఆంజనేయులు, మామిడి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

మానకొండూర్ రూరల్, మే 20: రంగపేట శివారులో గల మల్లకుంటలో వెల్ది రెవెన్యూ పరిధికి చెందిన ప్రభుత్వ భూమిలో దాదాపు 16 ఎకరాలను గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సీహెచ్ రాజుకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బావిలో పడిన నక్క

కేశవపట్నంలో అటవీ సిబ్బంది రక్షించిన నక్క

శంకరపట్నం, మే 20: కేశవపట్నం శివారులో నక్క ప్రమాదవశాత్తు బావిలో పడగా అటవీ సిబ్బంది రక్షించారు. మక్త గ్రామానికి చెందిన ముప్పిడి విజేందర్ రెడ్డికి కేశవపట్నం శివారులో వ్యవసాయ భూమి ఉంది. అందులో ఆ క్షేత్రానికి సాగు నీరందించే ఓ రింగ్ బావి ఉంది. నక్క ప్రమాదవశాత్తు ఆ బావిలో పడింది. తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లిన పనివారు దానిని చూసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సరిత, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నసీరుద్దీన్ అక్కడకు చేరుకుని గ్రామస్తుల సహాయంతో తాళ్ల ద్వారా నక్కను బయటకు తీసి రక్షించారు.

యువతి అదృశ్యం

రాంనగర్, మే 20 : నగరంలోని గౌతమినగర్‌కు చెందిన యువతి (20) కనిపించకుండా పోగా, ఆమె సోదరి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గౌతమినగర్‌కు చెందిన కాడ శిరీషకు ఏడాది క్రితం వివాహమైంది. అనారోగ్య కారణాలతో విడాకులు కావడంతో గౌతమినగర్‌లోని పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన శిరీష సోమవారం ఉదయం లేచేసరికి కనిపించ లేదు. ఆమె సోదరి అనూష, సోదరుడు అజయ్ చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

- తహసీల్దార్లకు బీజేపీ నాయకుల వినతి

హుజూరాబాద్ రూరల్/ మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి/వీణవంక/ శంకరపట్నం, మే 20: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం హుజూరాబాద్, మానకొండూర్, చిగురుమామిడి, వీణవంక, శంకరపట్నం మండలాల తహసీల్దార్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల్లోఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేలు అందజేయాలన్నారు. రైతు కూలీలకు రూ.12 వేలు, ప్రతి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని, రూ.రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ, మండలాధ్యక్షులు రాజు, కుమార్, మానకొండూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట రెడ్డి, రంగు భాస్కరాచారి, చిగురుమామిడిలో బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు కంది శంకర్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ జేరిపోతుల శ్రీనివాస్, వీణవంకలో బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహరాజు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ ఇంటికొచ్చి వెళ్తుండగా..

- కొలనూర్‌లో వ్యాన్ ఢీకొని మహిళకు గాయాలు
- దవాఖానలో చికిత్స పొందుతూ మృతి

కోనరావుపేట, మే 20: అమ్మమ్మ ఇంటికొచ్చి ఆటోలో తిరిగివెళ్తుండగా వ్యాన్ ఢీకొని మనుమరాలు తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన సంధ్యవేణి రేణుక(28) తన తల్లిగారి ఊరు తంగళ్లపల్లి మండలం రగుడు గ్రామానికి ఆదివారం వచ్చింది. అక్కడి నుంచి మధ్యాహ్నం కోనరావుపేట మండలం శివంగాళపల్లిలో ఉంటున్న అమ్మమ్మ వద్దకు వెళ్లింది. సాయంత్రం రంగారావుపల్లికి ఆటోలో తిరుగుపయనమైంది. ఈ క్రమంలో కొలనూర్‌కు చేరుకోగానే ఆటోను వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేణుకను స్థానికులు కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందింది. రేణుక సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి

దండేపల్లి, మే 20 : కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్(19) సోమవారం ప్రమాదవశాత్తు గూడెం వద్ద గోదావరిలో మునిగి మృతిచెందాడు. దండేపల్లి ఎస్ఐ భూమేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ మాలధారణ కోసం కీర్తన్‌గౌడ్ తన స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్ము సాయితో కలిసి సోమవారం ఉదయం 6 గంటలకు గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్లాడు. మాలధారణకు ముందు 10 గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. లక్షెట్టిపేటలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కీర్తన్‌గౌడ్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఎక్స్‌కవేటర్‌తో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న తొలగిస్తున్న సిబ్బంది

హుజూరాబాద్ రూరల్, మే 20: పట్టణ శివారు కరీంనగర్ రోడ్డులోని శాంత కళాశాల సమీపంలో 24/ఏ సర్వేనంబర్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను పురపాలక సంఘం అధికారులు సోమవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. సదరు నిర్మాణదారులకు పలు సార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించినట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంనగర్, మే 20: నగరంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖాన ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దవాఖానలోని పిల్లల వార్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి సిబ్బంది లోనికి తీసుకెళ్లి డాక్టర్లకు చూపించారు. అయితే ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, సంబంధికులు ఎవరైనా ఉంటే టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

ఆటోమొబైల్ డీలర్స్ ఆత్మీయ సమ్మేళనం

సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుందర్ సుబ్రమణ్యన్‌ను సన్మానిస్తున్న డీలర్లు

విద్యానగర్, మే 20 : శ్రీ సాయి డిస్ట్రిబ్యూషన్ కరీంనగర్ ఎనీ ఆయిల్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని 150 మంది డీలర్లు పాల్గొనగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుందర్ సుబ్రమణ్యన్, జీఎం కే శ్రీనివాసన్, సౌత్‌హెడ్ కొత్త అజయ్ కుమార్, తెలంగాణ ఇన్‌చార్జ్ పొన్నం రామ్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుందర్ సుబ్రమణ్యన్ మాట్లాడుతూ డీలర్‌కు, డిస్ట్రిబ్యూటర్‌కి మధ్య ఉండాల్సిన సాన్నిహిత్యం గురించి వివరించారు. ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లోని వివిధ రకాల ప్రొడక్ట్‌లపై అవగాహన కల్పించారు. గత సంవత్సరం శ్రీసాయి డిస్ట్రిబ్యూషన్ ఆల్ ఇండియాలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. దేశ జీడీపీలో అపార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భాగస్వామ్యం గురించి వివరించారు. పదిమంది టాప్ డీలర్లను సన్మానించారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన శ్రీసాయి డిస్ట్రిబ్యూషన్ నిర్వాహకులను అభినందించారు. డీలర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

1.5 కిలోల గంజాయి స్వాధీనం

రాంనగర్, మే 20 : కరీంనగర్ సుభాష్ నగర్‌కు చెందిన జక్కం సాయికృపాకర్ (19) అలియాస్ మున్నా కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద గల పడవ జంక్షన్ వద్ద త్రీ టౌన్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 1.5 కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. అతడు ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటైన మున్నా తనకు వచ్చే జీతం డబ్బులు సరిపోక పక్క రాష్ట్రాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి, కరీంనగర్‌లో యువకులకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలింది. నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నందుకు గానూ అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పుడు డాక్యుమెంట్‌తో భూమి విక్రయించిన ఇద్దరి అరెస్ట్

చొప్పదండి, మే 20: తప్పుడు డాక్యుమెంట్లతో భూమి అమ్మిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి శివారులోని సర్వేనంబర్ 301లో గుర్రం రాంరెడ్డికి 65 గుంటల భూమి ఉంది. ఈ భూమిని గుర్రం రాంరెడ్డి 2010 సంవత్సరంలో ముసిపట్ల దేవేందర్ రెడ్డి, అన్నాడి శ్రీకాంత్ రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశాడు. తర్వాత తన వాటాగా వచ్చిన 32 గుంటల భూమిని ముసిపట్ల దేవేందర్ రెడ్డి చొప్పదండికి చెందిన కొత్తూరి అంజయ్య, సుద్దాల వెంకటస్వామికి 2019 సంవత్సరంలో విక్రయ ఒప్పందంతో పాటు ఉపసంహరించుకోలేని జీపీఏ చేశాడు. తర్వాత వారు ఆ భూమిలో ఆరు గుంటలను ఎలిగేడుకు చెందిన చిలుక బాలమణికి, మిగతా 26 గుంటల భూమిని కళ్లెం అంజిరెడ్డికి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం సర్వే నంబర్ 301లో సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు అంజయ్యకు ఎలాంటి భూమి హక్కులు లేకున్నా పాత జీపీఏ డాక్యుమెంటుతో కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్ రెడ్డి దగ్గర దాదాపు రూ.ఎనిమిది లక్షలు తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. అతడికి మోకా చూపిస్తామని చాలా రోజుల నుంచి తిప్పించుకున్నారు. తర్వాత భూమి కోసం ఇంకొకసారి అడిగితే అంతు చూస్తామని బెదిరించడంతో మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో నిందితులు వెంకటస్వామి, అంజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వరి వేద్దామా.. వద్దా?

- ఈసారి వర్షాలపైనే ఆధారం
- సాగుపై రైతుల్లో సందిగ్ధం

యాసంగి పంటలను పూర్తి చేసుకున్న రైతాంగం.. మరికొద్ది రోజుల్లో వానకాలం సీజన్‌కు సమయాత్తం అవుతున్నది. 'కాళేశ్వరం' జలాలు బంద్ కావడంతో సాగునీటి ఎద్దడితో యాసంగి పంటను పారించడానికి నానా తిప్పలు పడిన నేపథ్యంలో ఏ పంట వేయాలన్న విషయమై డోలాయమానంలో ఉంది. ఇప్పటికే భూగర్భ జలమట్టం తగ్గడం, బావుల్లో నీళ్లు లేకుండా పోవడంతో రైతులు ప్రస్తుత సీజన్‌లో కేవలం వర్షాలపైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వరివేద్దామా.. లేక ప్రత్యామ్నాయం పంటలు పండిద్దామా అని అన్నదాతల్లో సందిగ్ధం నెలకొన్నది.

- తిమ్మాపూర్, మే 20

రామకృష్ణకాలనీలో యాసంగి పంట కోసి వదిలేసిన పొలం

తిమ్మాపూర్ మండలంలో ఏటా వానకాలం 24వేల ఎకరాలు, యాసంగి 20వేల ఎకరాలు సాగు అవుతున్నది. అయితే గతంలో వానకాలం సీజన్‌లో వర్షాలతో సంబంధం లేకుండా జూన్ మొదటి వారం నుంచే వరినార్లు సిద్ధం చేసుకునేవారు. కానీ నేడు భూగర్భజలాల మట్టం తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెట్ట ప్రాంతాల్లో వరి సిరి..

మండలంలోని పోరండ్ల నుంచి మొగిలిపాలెం వరకు మెట్ట ప్రాంతం. ఈ ప్రాంతం అంతా ఒకప్పుడు పంటలు వేసేందుకు రైతులు జంకేవారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా నీరందించడంతో ఆరేడేళ్లు ఈ ప్రాంతమంతా పంటలతో కళకళలాడింది. మళ్లీ మొన్నటి యాసంగి సీజన్‌లో నీళ్లు లేక, కాల్వలు రాక సగం పంటలు ఎండిపోయాయి.

తగ్గిన పంట దిగుబడి..

గత యాసంగితో పోల్చితే ఈ యాసంగి దిగుబడి తగ్గిపోయింది. మండలంలో నుస్తులాపూర్, పోరండ్ల సొసైటీలతో పాటు ఐకేపీ మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ సీజన్‌లో పోరండ్ల సొసైటీ ద్వారా 30వేల క్వింటాళ్లు, నుస్తులాపూర్ సొసైటీ ద్వారా లక్షా 5వేల క్వింటాళ్లు, ఐకేపీ మహిళా సంఘాల ద్వారా కేవలం 25వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు.

అనుకూలించని పరిస్థితులు

ప్రస్తుతం చాలా మంది రైతులు యాసంగి పనులు పూర్తి చేసుకుని వానకాలానికి సిద్ధమవుతున్నారు. కానీ, బావుల్లో నీళ్లు లేక వరి నారు పోయడానికి వెనుకడుగు వేస్తున్నారు. నారు పోద్దామా..వద్దా.. అని సంకోచిస్తున్నారు. ఒక వేళ జూన్ మొదటి వారంలో నారు పోస్తే వర్షాలు రాక భూగర్భజలాలు వృద్ధి చెందకపోతే పరిస్థితేంటి అని ఆలోచిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు వానలకు ఎదురుచూడకుండా నారు పోసుకుని నాట్లు వేసుకున్నామని.. నేడు మళ్లీ వర్షాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

వానలు రానిదే పంట వేయం..

మాకు మళ్లీ పదేండ్ల కిందటి పరిస్థితులు కండ్ల ముందట కనిపిస్తున్నయ్. వానలు పడితేనే పంటలు వేసుకునేది. కేసీఆర్ సర్ ప్రభుత్వం కాళేశ్వరం జలాలను మా మెట్ట ప్రాంతాలకు తీసుకువచ్చినంక ఆరేడేండ్లు ఏ గోస లేకుంట పంటలు పండిచ్చుకున్నం. కని, మొన్న యాసంగి చాలా వరకు పంటలు ఎండిపోయినయ్. ఆ భయంతో ఇప్పుడు వానకాలం వానలు రానిదే వడ్లు పోయం.

-పాశం అశోక్‌రెడ్డి, రైతు, మొగిలిపాలెం

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

ఇల్లంతకుంట, మే 20: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తలించామని ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రాచారి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య 2018లో గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్లం రాము, దారం శ్రీనివాస్‌రెడ్డి, తిప్పరవేణి చంద్రశేఖర్ అనే నలుగురిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన కారునాథం శివకృష్ణకు సిరిసిల్లలో పరిచయం చేశాడు. తనకు కొంత డబ్బు ఇస్తే ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని శివకృష్ణ వారిని నమ్మించాడు. ఈ క్రమంలో వారి నుంచి ₹6.50లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న నగదును శివకృష్ణ తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయామని బాధితులు తెలుసుకున్నారు. ఈ మేరకు ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సోమవారం ఇల్లంతకుంట బస్టాండ్ వద్ద శివకృష్ణను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఇక్కడ సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ రాజుగౌడ్ ఉన్నారు.

ప్రశాంతంగా టెట్

కమాన్‌చౌరస్తా, మే 20: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను కేటాయించగా, ఉదయం నిర్వహించిన పరీక్షకు 1520 మంది అభ్యర్థులకు గానూ 1408 మంది హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం 1520 మంది అభ్యర్థులకు గానూ 1356 మంది పరీక్ష రాశారు. ఉదయం పరీక్షకు 112 మంది, మధ్యాహ్నం పరీక్షకు 164 మంది గైర్హాజరయ్యారు.

నేతన్నలకు న్యాయం జరిగే వరకూ పోరాటం

రాజన్న సిరిసిల్ల, మే 20 (నమస్తే తెలంగాణ): నేతన్నల ఉపాధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు యథావిధిగా కొనసాగించాలని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ టీపీవీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో టీపీవీయూ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సిరిసిల్ల చేనేత జౌళీశాఖ ఏడీ సాగర్‌కు అందజేశారు. వస్త్ర పరిశ్రమ సమస్యలపై వెంటనే సమీక్షా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్సను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

WANTED

★బుక్ పబ్లికేషన్‌లో పని చేయుటకు లేడి టీచర్ ట్రైనర్స్ (3) కావలెను. డిగ్రీ, ప్రీ ప్రైమరీ/ ప్రైమరీ బోధన అనుభవం, జర్నీ ఇష్టం ఉండాలి. లాంగ్వేజ్ స్కిల్స్. M. 7382733795, Peddapalli, GDK.
NTW-14429

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194